శిథిలావస్థలో 'సమాఖ్య' భవనం



శిథిలావస్థలో మండల మహిళా సమైక్య భవనం

- రెండుసార్లు నిధులు మంజూరైనా వెనక్కి వెళ్లిన వైనం
- మండలంలో 4,974 మంది మహిళా సంఘ సభ్యులు

వీపనగండ్ల: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల మహిళా సమాఖ్య కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో సంఘ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వారు సమావేశాలు నిర్వహించుకునే సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. మహిళలను ఓ సంఘంగా ఏర్పాటు చేసి వారిని ఆర్థిక బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పూనుకుంది. దీనికోసం ప్రతి నెల మండల కేంద్రంలో సమావేశాలు నిర్వహించుకునేందుకు అనువుగా ఉండే విధంగా సమాఖ్య కార్యాలయం నిర్మించారు. కానీ నిర్వహణ సరిగా లేకపోవడంతో పాటు భవనంలో కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు.

443 స్వయం సహాయక సంఘాలు

మండలంలోని 14 గ్రామపంచాయతీలకు గాను బొల్లారం గ్రామంలో 53 స్వయం సహాయక సంఘాలు ఉండగా.. అందులో 554 మంది సభ్యులు ఉన్నారు. గోపల్‌దిన్నెలో 31 సంఘాలకు గాను 355 మంది సభ్యులు, గోవర్ధనగిరిలో 29 సంఘాలకు



ఇరుకుగదిలోనే మామిడికాయల ట్రేలు

304 మంది సభ్యులు, కల్వరాలలో 60 సంఘాలకు 710 సభ్యులు, కొర్లకుంటలో 10 సంఘాలకు 118 మంది సభ్యులు, నాగర్లబండ తండాలో 11 సంఘాలకు 111 సభ్యులు, పుల్గర్‌చర్ల 32 సంఘాలు 354 మంది సభ్యులు, రంగవరంలో 9 సంఘాలకు 100 మంది సభ్యులు, సంపత్‌రావుపల్లిలో 21 సంఘాలకు 247 మంది సభ్యులు, సంగినేనిపల్లిలో 42 సంఘాలకు 449 మంది సభ్యులు, తూంకుంటలో 53 మంది సంఘాలకు 554 మంది సభ్యులు, వల్లభాపురం తండాలో 13 సంఘాలకు 169 మంది సభ్యులు, వల్లభాపురంలో 15 సంఘాలకు 157 మంది సభ్యులు, వీపనగండ్లలో 64 సంఘాలకు 792 మంది సభ్యులు, మొత్తం మండలంలో 443 స్వయం సహాయక సంఘాలకు గాను 4974 మంది మహిళా సంఘ సభ్యులు ఉన్నారు.

కనీస వసతులకు నోచుకోవడం లేదు



మండల కేంద్రంలోని సమాఖ్య భవనం శిథిలావస్థకు చేరుకోవడం వర్షాకాలంలో పూర్తిగా వర్షపు నీరు కిందికి వస్తుండడంతో రికార్డులను సైతం భద్రపరచలేకపోతున్నాం. మహిళలకు అవసరమైన కనీస వసతులు కూడా లేనందున సంఘ సమావేశాలకు వచ్చే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. నూతన భవనాన్ని నిర్మించి అన్ని వసతులు కల్పించాలి.

– శాంతమ్మ, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు, వీపనగండ్ల

ఉన్నతాధికారులకు విన్నవిస్తాం



భవనం శిథిలావస్థకు చేరిన విషయాన్ని ఉన్నతాధికారులకు వివరిస్తాం. సరిపడా గదులు లేకపోవడంతో సమైక్య రికార్డులతో పాటు మామిడి తోటల రైతులకు అందజేసే ట్రేలను ఒకే గదిలో భద్రపరిచాం. నూతన భవన నిర్మాణాన్ని చేపడితే కార్యాలయ సిబ్బందితో పాటు మహిళలకు మేలు జరుగుతుంది.

– బిచ్చన్న, ఏపీఎం, వీపనగండ్ల

శిథిలావస్థలో భవనం

27జనవరి 2012 సంవత్సరంలో భారత్ నిర్మాణ్ రాజీవ్ గాంధీ సేవా కేంద్ర భవనం పేరుతో ఈ మహిళా సంఘ భవనాన్ని నిర్మించేందుకు రూ.25 లక్షలు విడుదల చేశారు. భవన నిర్మాణానికి ఆనాటి రాష్ట్ర పౌరసరఫరాల సమాచార శాఖ మంత్రి డీకే అరుణ శంకుస్థాపన నిర్వహించి త్వరలోనే భవనాన్ని పూర్తి చేస్తామని చెప్పినా.. నేటికీ భవన నిర్మాణం చేపట్టలేదు. వచ్చిన నిధులు తిరిగి వెళ్లాయి.

కష్టపడితే అద్భుతాలు సృష్టించొచ్చు



మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్



కొత్తకోటలో..



మదనాపురంలో..

పాన్‌గల్: విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివితే అద్భుతాలు సృష్టించొచ్చని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, జీహెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముఖి టాలెంట్ పరీక్షలు నిర్వహించారు. మండల స్థాయిలో ప్రతిభ చూపి జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు వారు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైన్స్‌తోనే భవిష్యత్ అని, సైన్స్‌లో మనిషి అపూర్వ విజయాలు సాధిస్తూ జీవితాన్ని సులభతరం చేసుకుంటున్నాడన్నారు. చంద్రమండలంపై నివాసం ఉండటానికి పరిశోధనలు జరుగుతున్నాయని వివరించారు. మూఢనమ్మకాలకు దూరంగా ఉంటూ శాస్త్రీయంగా జీవించాలని సూచించారు. మండల స్థాయిలో ప్రతిభ చాటి జిల్లా స్థాయికి తెలుగు మీడియంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలనుంచి ముగ్గురు, ఇంగ్లిష్ మీడియంలో మాందాపూర్ ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికై నట్లు వారు పేర్కొన్నారు. ఫిబ్రవరి 3వ తేదీన నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, విద్యార్థుల సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం నాణ్యతగా, రుచికరమైనదిగా అందించాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

కొత్తకోట రూరల్: జనవిజ్ఞాన వేదిక తెలంగాణ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మండల స్థాయి చెకుముఖి పోటీలను మండల విద్యాధికారి కృష్ణయ్య ఆధ్వర్యంలో విజవంతంగా ముగిశాయి. పట్టణ కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు దేవని ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విభాగం తెలుగు, ఇంగ్లిష్ మీడియం నుంచి జెడ్పీహెచ్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రైవేట్ పాఠశాలల విభాగం నుంచి నివేదిత హైస్కూల్ ఎంపిక కాగా.. వీరికి ఫిబ్రవరి 3న జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వివేకానంద, సత్యం, వెంకటేష్, ధనుంజయ్‌గౌడ్, శ్రీశైలం వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకిముఖీ పోటిలు నిర్వహించారు. ఈ పోటీల్లో దుప్పల్లి పాఠశాలకు చెందిన విద్యార్థులు కృష్ణవేణి, యాస్మిన్, మానస, ప్రియాంక, మాధురి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మూలే ఆంజనేయులు, ఉపాధ్యాయులు రాజు, నిరంజన్‌గౌడ్, కష్ణయ్య, మల్లయ్య, పాండురంగ, ఇషాక్ పాషా, మహేంద్రమణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీఆర్టీయూ డైరీ ఆవిష్కరణ



కొత్తకోట రూరల్: పీఆర్టీయూ 2024 నూతన సంవత్సర డైరీని కొత్తకోటలోని ఎమ్మార్సీ భవనం వద్ద దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి ఆ సంఘం సభ్యులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయులకు 50ఏళ్లుగా సేవలందిస్తున్న పీఆర్టీయూకు రాష్ట్రంలో మంచి గుర్తింపు ఉందన్నారు. ఉపాధ్యాయులకు ఏమైనా సమస్యలను ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థులకు ఆసక్తి పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షుడు కె.లక్ష్మయ్య, జిల్లా గౌరవ అధ్యక్షుడు సూర చంద్రశేఖర్, సునీల్‌కుమార్, శ్రీశైలం, సత్యనారాయణ, లక్ష్మయ్య, గోపాల్, బాలరాజు, శివకుమార్, వివేకానంద, నిర్మలాదేవి, ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ప్యాడ్‌లు అందజేత



పెబ్బేరు రూరల్: కుటుంబ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా శనివారం పెబ్బేరు బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివే 19 మంది విద్యార్థునులకు పరీక్షల నిమిత్తం ప్యాడ్‌లను 2వ వార్డు కౌన్సిలర్ సామాజికవేత్త మంద అక్కమ్మ, హెచ్‌ఎం వరలక్ష్మి పంపిణీ చేశారు. ప్యాడ్‌ల వితరణపై విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

అధికారులకు సన్మానం



పెబ్బేరు రూరల్: హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో శనివారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ఉత్తమ ప్రశంసా పత్రాలు అందుకున్న తహసీల్దార్ మురళిగౌడ్, ఆర్ఐ రాధాకృష్ణ, కానిస్టేబుల్ మధు సన్మానించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ భవిష్యత్‌లో ప్రజాసేవ చేస్తూ సర్వీసులో ఉత్తమ స్థానాలను చేరుకొని, మరెన్నో పథకాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాళ్ల రాఘవేంద్ర, గంగాధర్, మాధవశెట్టి, రాజుల శివ, మల్లేష్, రాజు, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి వసంతపురం రాజు పాల్గొన్నారు.

విహారయాత్రకు వసతి గృహ విద్యార్థులు



అమరచింత: జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ వసతి గృహ విద్యార్థులు శనివారం విహారయాత్రకు బయలు దేరారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి జిల్లా అధికారి నుశిత యాత్రకు బయలు దేరుతున్న బస్సుకు పూజలు నిర్వహించి యాత్ర ప్రారంభించారని అమరచింత ఎస్సీ వసతి గృహ వార్డెన్ బెనర్జీ తెలిపారు. జిల్లాలోని అన్ని షెడ్యూల్డ్ కులాల సంక్షేమ వసతి గృహాలకు చెందిన బాలికలు, బాలురు విహార యాత్రకు వెళ్తున్న సందర్భంగా విద్యార్థులకు తగు జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో వసతిగృహాల అధికారులు బెనర్జీ, జీసీ రాజు, సత్యనారాయణ, ప్రవీణ్‌కుమార్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్టలో పలు వార్డుల్లో విద్యుత్ సమస్య ఉండగా ఆయా కాలనీవాసులు సర్పంచ్ గాదం రాణి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వెంటనే స్పందించిన సర్పంచ్ ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించారు. ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం కాలనీవాలతో కలిసి ప్రారంభించారు. కాలనీలో విద్యుత్ సమస్య ఉందని చెప్పిన వెంటనే సమస్యను పరిష్కరించిన సర్పంచ్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పరమేష్, సుజాత, రవి, బాబు, భరత్‌కుమార్, బాలకొండ, నాగరాజు తదితరులు ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

వనపర్తి టౌన్: బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డిని పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో అసెంబ్లీ, మండల అధ్యక్షులు శాలువా, బొకేతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బచ్చు రాము మాట్లాడుతూ.. మూడున్నరేళ్ల నుంచి బీజేపీని ఎంతో ముందుకు తీసుకొచ్చారని, 2023 ఎలక్షన్‌లో ఓట్ బ్యాంక్ పెంచారని గుర్తుచేశారు. కుటుంబ సభ్యులతో సంతోషంగా ఆయుఆరోగ్యాలతో సుఖంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షులు అరవింద్ రెడ్డి, నవీన్ రెడ్డి, రమేష్, భగవంతు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



మహిళలు ఆర్థికంగా రాణించాలి



మహిళ సంఘాల సభ్యులతో విద్యార్థులు

మదనాపురం: సామాజిక విజ్ఞాన కళాశాల, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ బీఎస్సీ డిగ్రీ విద్యార్థినులు గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ కార్యక్రమం ద్వారా గ్రామీణ కుటుంబ స్థితిగతులపై అధ్యయనం చేస్తున్నారు. శనివారం రాత్రి నెలివిడిలో కేవీకే శాస్త్రవేత్త అనిత ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా సంఘాల బలోపేతంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం మహిళలకు ఇస్తున్న రుణాల గూర్చి వివరించారు. కార్యక్రమంలో విద్యార్థినులు మేఘన, రసజ్ఞ, రచన, సుష్మ, చరణ్య, గీత, పావని, మోహిని, కష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

'పార్టీకి ద్రోహం చేసిన వారిని క్షమించం'



మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: పార్టీకి ద్రోహం చేసిన వారిని ఎప్పటికీ క్షమించేది లేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్పంచులు, ఉపసర్పంచుల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ చేస్తున్న కాలయాపనపై బీఆర్‌ఎస్ నాయకులు తిరగబడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర బడ్జెట్‌పై ఆలోచనలేని కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ఏటా వెచ్చించాల్సి ఉంటుందన్నారు. యాసంగి అదును దాటుతున్నా.. రైతులకు పూర్తిస్థాయిలో ఇప్పటికింకా రైతుబంధు ఇవ్వకపోవటం కాంగ్రెస్ మొదటి వైఫల్యంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం

పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేసే ప్రతి కార్యకర్తను కాపాడుకుంటామని రాజ్యసభ మాజీ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. ఎంతో కష్టపడి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన కేసీఆర్ సర్కారు అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు గుర్తు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, నాయకులు మాణిక్యం, పాకనాటికృష్ణ, గౌని బుచ్చారెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్‌కు సన్మానం

కొత్తకోట రూరల్: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కుర్మయ్యగౌడ్‌ను పలువురు నాయకులు శాలువాలతో సత్కరించారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందించినందుకు గాను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ రక్షిత కె.మూర్తి గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కుర్మయ్యగౌడ్‌కు ప్రశంసాపత్రాన్ని ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, శంకర్‌గౌడ్, నర్సింహగౌడ్, సతీష్‌గౌడ్ ఉన్నారు.



వడ్ల బస్తాలు చోరీ

చిన్నంబావి: మండలంలోని బెక్కెం గ్రామానికి చెందిన బోయ గోపాల్ ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం విక్రయించేందుకు 40 సంచుల్లో నింపి కల్లం వద్ద ఉంచగా.. శుక్రవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం వచ్చి చూడగా బస్తాలు కనిపించకపోవడంతో బాధితుడి వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మండలంలోని పెద్దదగడ, దగడపల్లి, వెలగొండ గ్రామాల్లో సైతం ఇలాంటి ఘటనలు జరిగాయి. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను ఇలా కాపాడుకోవడానికి కూడా కష్టం అవుతుందని, తనకు ప్రభుత్వం నుంచి సాయం అందించాలని బాధిత రైతు కోరాడు.

వ్యక్తి అదృశ్యం

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలోని పాతబజారులో నివాసముంటున్న ఎత్తుపల్లి రాజు ఈ నెల 25 తేదీ నుంచి కనబడం లేదని కొడుకు ఎత్తుపల్లి ప్రసాద్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ యుగంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. వనపర్తి పట్టణంలోని పాతబజారుకు చెందిన ఎత్తుపల్లి రాజు కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండు నెలల కింద కాలికి దెబ్బ తగలడంతో పనికి వెళ్లకుండా ఇంటి దగ్గరే ఉండేవాడు. ఈ నెల 25 రోజున కుటుంబ సభ్యులందరూ కూలి పనికివెళ్లి వెళ్లారు. అప్పుడు ఇంట్లోకి వెళ్లిన ఆయన తిరిగి రాలేదని కుమారుడు ప్రసాద్ తెలిపాడు.

ఆర్థికసాయం అందజేత



వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 25వ వార్డుకు చెందిన ఆసియా సమ్రీన్ ఇటీవల రెండో అంతస్తు నుంచి కిందపడటంతో కాలు ఫ్యాక్చర్ అయ్యింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి వనపర్తి నియోజకవర్గ సమన్వయ కర్త లక్కాకుల సతీష్, పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్ ద్వారా రూ. 10వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. అదే విధంగా వార్డు కౌన్సిలర్ లక్ష్మి విద్యార్థి సమ్రీన్‌కు రూ. 5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో రవి యాదవ్, కృష్ణబాబు, వెంకటేష్, రఘుయాదవ్, జయనందం, ఆదిత్య, వినయ్, లతీఫ్, అస్లాం, శశాంక్ సాగర్, అఖిల్, ఉదయ్ పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని చంద్రాయణగడ్డ కాలనీకి చెందిన చెట్టమోని మాసమ్మ (64) అనారోగ్యంతో శనివారం మరణించింది. విషయాన్ని మండల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన రూ.ఐదు వేలు పంపగా స్థానిక నాయకులు శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. అదేవిధంగా ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి కుమారుడు ఆదిత్యారెడ్డి రూ.మూడు వేలు పంపగా.. స్థానిక నాయకులు వారి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

పరామర్శ

కొత్తకోట రూరల్: షిరిడి దర్శనానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో భార్య, కుమారుడిని కోల్పోయిన కృష్ణయ్యను దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. మృతుదేహాలను షిరిడి నుంచి శనివారం ఉదయం కొత్తకోటకు తీసుకురాగా కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వసుధ, చిన్నారి శ్రీమాన్ మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాలెం గ్రామానికి చేరుకుని గుండెపోటులో మృతి చెందిన అజ్జకొల్లు వెంకట్‌రెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళుర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రశాంత్, బోయేజ్, కృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, నరేందర్‌రెడ్డి ఉన్నారు.

నేడు జీపీ కార్మికుల సమావేశం

పాన్‌గల్: మండల స్థాయి గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశం ఆదివారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాము శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఆయా గ్రామాల జీపీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ఖిల్లాఘనపురం: సీజనల్ వ్యాధులతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైఆర్‌జీ కేర్ సంస్థ డీఆర్పీ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అల్లమాయపల్లిలో లోకల్‌బాడీ సమీవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు వ్యాధుల నివారణ గురించి మాట్లాడారు. ముఖ్యంగా హెచ్‌ఐవీ గురించి ప్రజలకు వివరించారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ వ్యాధి టెస్టు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శేషయ్య, లింక్ వర్కర్ కాశయ్య, ఆశాకార్యకర్త రాజ్యలక్ష్మి, భారతమ్మ, అంగన్‌వాడీ టీచర్ వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నుంచి బహిష్కరణ

ఆత్మకూర్: సీపీఎం కార్యకలాపాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న శ్రీహరి, గోపాలకృష్ణను పార్టీ నుంచి బహిస్కరిస్తున్నామని సీపీఎం జిల్లాకార్యదర్శి జబ్బార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జీఎస్ గోపి అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ సదరు నాయకులు రెండేళ్లుగా పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని, పద్ధతి మార్చుకోవాలని సూచించినా ఫలితం లేక పోయిందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



బడిలో చేరిన బాలికతో హెచ్‌ఎం, సీఆర్పీలు

పాన్‌గల్: బడిబయటి పిల్లల సర్వేలో భాగంగా శనివారం మండల కేంద్రంలో బడిబయటి ఉన్న 9వ తరగతి విద్యార్థి గీతను జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సీఆర్పీ గోవింద్ చేర్పించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో గీత 9వ తరగతి వరకు చదివి మధ్యలో బడి మానివేసింది. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులకు చదువు యొక్క ప్రాముఖ్యత, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులపై అవగాహన కల్పించి బాలికను బడికి పంపించే విధంగా తల్లిదండ్రులను ఒప్పించినట్లు సీఆర్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఉమాదేవి, సీఆర్పీ బాలవర్ధన్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కోడేరు: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సీనియర్ సివిల్ జడ్జి సబిత అన్నారు. శనివారం మండల కేంద్రంలో బాలికల గురుకుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆడ పిల్లలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చి తమ గ్రామాలకు గుర్తింపు తీసుకురావాలన్నారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు గదుల కొరత, తరగతి గదిలోనే పాఠాలు చెప్పడం, అక్కడే భోజనాలు చేయడం, అల్మారాలు లేవన్నారు. కనీసం బాత్‌రూంలకు తలుపులు లేవని, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ప్రిన్సిపాల్ రష్మికి సూచించారు. కొల్లాపూర్ ప్రధాన సివిల్ జడ్జి నితిన్‌తేజ, అదనపు సివిల్ జడ్జి జ్యోత్స్న గుంటి, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సబిత

ఖాదర్‌పాష దర్గా ఉర్సు ఏర్పాట్ల పరిశీలన

కొల్లాపూర్: పట్టణంలోని ఖాదర్‌పాష దర్గా ఉర్సు ఉత్సవాలు ఆదివారం గంధోత్సవంతో ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉర్సు ఉత్సవాలు నిర్వహించనున్నారు. దర్గా వద్ద ఉత్సవాల ఏర్పాట్లను శనివారం మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ మహిమూదాబేగం, కౌన్సిలర్లు సిబ్బంది నర్సింహరావు, రహీంపాష, నయూమ్, డాక్టర్ రాముడుయాదవ్‌లు పరిశీలించారు. కమిషనర్ రాజయ్యను దర్గా వద్దకు పిలిపించి, భక్తులకు అవసరమైన ఏర్పాట్లను మున్సిపాలిటీ ద్వారా పర్యవేక్షించాలని సూచించారు. నాయకులు వేణుగోపాల్‌యాదవ్, ఖాదర్‌పాష, తాహెర్, మల్లయ్య, కృష్ణమనాయుడు, దిలీప్‌శెట్టి తదితరులున్నారు.



దర్గా వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్

పల్లీ ఆయిల్ మిల్లు ప్రారంభం

మదనాపురం: చిన్న తరహా ఆహార తయారీ పరిశ్రమలను బలోపేతం చేసే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పీఎంఎఫ్ ఎంఈ స్కీమ్ ద్వారా మండల కేంద్రానికి చెందిన శోభ రూ.18 లక్షలతో పల్లీ ఆయిల్ మిల్లును ఏర్పాటు చేశారు. దీనిని శనివారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, మహిళ సమైఖ్య అధ్యక్షురాలు రేణుక, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగన్న, నాయకులు జగదీశ్, వడ్డె కృష్ణ, హనుమాన్‌రావు, మహదేవన్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, వేమన్న, రాంచంద్రయ్య, సత్యాశీలారెడ్డి, సాయిబాబా, ఏపీఎం కృష్ణవేణి, సీసీలు విజయలక్ష్మి, దయానంద్, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.